క్లుప్తంగా

జంధ్యాలపై ప్రసంగం నేడు

సీతంపేట: 'హాస్యానికి భాష్యం చెప్పిన జంధ్యాల' అనే అంశంపై ఆంధ్రా లయోలా కాలేజీ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఎం.సి.దాస్ ఆదివారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రసంగిస్తారని విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రసంగం ప్రారంభం అవుతుందని, జంధ్యాల అభిమానులు , సాహితీవేత్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా కాటమ్మ ఆలయ వార్షికోత్సం

తాటిచెట్లపాలెం: సీతమ్మధార పీ అండ్ టీ కాలనీ, నక్కవానిపాలెంలో కొలువైన కాటమ్మ, నాగదేవతల ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన నిర్వహించారు. సాయంత్రం మహిళల కోలాటం ప్రదర్శన ద్వారా భక్తులను ఆకట్టుకున్నారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో విశేష కార్యక్రమాలు



వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో యోగాసనాలు వేస్తున్న అర్చకుడు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో శనివారం విశేష కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి స్వామికి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. యోగాంధ్ర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు యోగాసనాలు సాధన చేశారు. అర్చకుడు శేషాచార్యుల భక్తులతో యోగా సాధన చేయించారు.

'జగన్ అంటే నమ్మకం..'



జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సీతంపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆదేశాల మేరకు జీవీఎంసీ 25వ వార్డు సీనియర్ నాయకుడు బోగవిల్లి గోవింద్ ఆధ్వర్యంలో సీతంపేటలో జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే మ్యానిఫెస్టోలోని 90 శాతానికి పైగా హామీలు అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి సొంతమని, చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సూపర్ సిక్స్ హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతూ, అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సారిపిల్లి సంతోష్, గుదేరాజు, నూకరాజు, కొమ్ము నాగు, రవీంద్ర, సిద్ధు, బొమ్మాళి రవి, కాశీ, ముద్దాడ అశోక్, విజయ్, రామారావు, దివాకర్, వీరమ్మ, కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు రమణ గుండెపోటుతో మృతి

కంచరపాలెం: అనేక వార్తా పత్రికల్లో 20 ఏళ్లకు పైగా జర్నలిస్టుగా సేవలందించిన సీనియర్ జర్నలిస్టు సబ్బవరపు వెంకట రమణ శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలతో కంచరపాలెం బర్మా క్యాంపులో నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి హఠాత్తుగా గుండెపోటు రావడంతో కేజీహెచ్‌కు తరలించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో అర్ధరాత్రి బర్మా క్యాంప్ శ్మశాన వాటిక బయట పార్థివ దేహాన్ని ఉంచారు. శనివారం మధ్యాహ్నం అంత్యక్రియలు చేపట్టారు. ఆయన ఇద్దరు కుమార్తెలు గుండెలు పగిలేలా ఏడ్చి సొమ్మసిల్లిపోయారు. ఎస్వీ రమణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జర్నలిస్టు సంఘాలు కోరాయి.

అన్నింటా వెనుకబడి

- రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ దుస్థితి ఇది
- అటకెక్కిన ఆర్‌వో ప్లాంట్
- అందుబాటులోకి రాని బెంచీలు
- సిబ్బంది కూడా కొరతే



బెంచీలు లేకపోవడంతో నేలమీద కూర్చునే చదువుకుంటున్న 1వ తరగతి విద్యార్థులు



అధ్వానంగా పాఠశాల పరిసరాలు



రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రవేశ ద్వారం

తాటిచెట్లపాలెం: ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని, రూపురేఖలను మార్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే. గత ముఖ్యమంత్రి జగన్‌మోహన రెడ్డి విద్య, విద్యార్థుల విషయంలో, ప్రభుత్వ పాఠశాలల స్థితిగతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నాడు నేడు, స్మార్ట్‌సిటీ నిధులతో పలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, తరగతి గదుల విస్తరణ చేపట్టారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల పట్ల ఎలాంటి శ్రద్ధ చూపడంలేదు. పైగా వీటి నిర్వహణ పూర్తిగా గాలికొదిలేశారు.

జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో గల జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ ఎంతో చరిత్ర కలిగినది. దాదాపు 58 ఏళ్ల ఘన చరిత్ర కల్గిన ఈ పాఠశాలలో నేడు విద్యార్థులకు కనీసం కూర్చునేందుకు బెంచీలు కూడా లేవు. ఎన్నో సార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఇక్కడ కొన్ని పాత బెంచీలు ఉన్నాయి. కానీ చిన్న పిల్లలకు ఇవి అనువుగా ఉండవు. వీరికి చిన్న బెంచీలు కావలసి ఉంది. ఇవి లేకపోవడంతో పిల్లలను నేలమీదే కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. ఈ స్కూల్‌లో సుమారు 200 మంది విద్యార్థులు ఉన్నారు. 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. నిబంధనల ప్రకారం 1:30 ఉండాల్సిన టీచర్ స్టూడెంట్స్ రేషియో ఇక్కడ అంతకంటే ఎక్కువగానే ఉంది. ఇటీవల బదిలీలు, సర్దుబాట్లు జరగ్గా ప్రస్తుతం ఇక్కడ ప్రధానోపాధ్యాయుడు కాక 8 మంది సిబ్బంది ఉన్నారు. ప్రధానోపాధ్యాయురాలు కూడా త్వరలో పదవీవిరమణ చేయనున్నారు. అప్పుడు కనీసం ఇక్కడ మరో ఇద్దరు ఉపాధ్యాయుల అవసరం ఏర్పడుతుంది. కానీ వీరిని ఎప్పుడు భర్తీ చేస్తారో తెలియదు.



పాఠశాలలో మరమ్మతుకు గురైన ఆర్‌వో ప్లాంట్

అటకెక్కిన ఆర్‌వో ప్లాంట్..

ఈ పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. కానీ ఇది కొన్ని నెలలుగా పని చేయడం లేదు. దీంతో మంచినీటి కోసం జీవీఎంసీ నుండి వాటర్ కేన్స్ ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆర్‌వో ప్లాంట్ మరమ్మతుల కోసం సిబ్బంది ఫిర్యాదు చేసినా స్పందన లేదు. కొందరు వచ్చి ఫొటోలు మాత్రం తీసుకెళ్లారు కానీ ఇప్పటి వరకు దీనిని బాగు చేయలేదని తెలుస్తోంది.

అంబేడ్కర్ గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశాఖ-అనకాపల్లి జిల్లాల్లోని 11 డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉభయ జిల్లాల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త ఎస్.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 బాలుర, 7 బాలికల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల బాలబాలికలు ఆయా పాఠశాలల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్‌ను జత చేసి ఈ నెల 24వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 12 గంటల లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. 25న బుధవారం ఉదయం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. వివరాలకు జిల్లా హెల్ప్‌లైన్ నంబర్ 0891-2799641లో సంప్రదించాలని సమన్వయకర్త రామకృష్ణ కోరారు.

గురు శిష్యుల బంధంపై ఆధ్యాత్మిక ప్రసంగం నేడు

సీతంపేట: అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు 'గురు శిష్యుల బంధం' అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి సన్నిధిలో ప్రముఖ రచయిత, విమర్శకుడు డాక్టర్ డి.వి.సూర్యారావు ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారని తెలిపారు. అనంతరం దత్తేశ్వరానంద భారతీ స్వామి అనుగ్రహ భాషణం చేస్తారని తెలిపారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఆరోగ్య ప్రదాయిని యోగా



యోగా సాధనలో డీఆర్‌ఎం లలిత్ బోరా



యోగా సాధన చేస్తున్న రైల్వే అధికారులు, సిబ్బంది, ఈకార్వో ప్రతినిధులు

- డీఆర్‌ఎం లలిత్ బోరా
- ఘనంగా యోగా దినోత్సవం

తాటిచెట్లపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వాల్తేర్ రైల్వే డివిజన్‌లో ఈ నెల 16 నుంచి 21 వరకు ప్రత్యేక కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. వాల్తేర్ రైల్వే క్రికెట్ స్టేడియంలో జరిగిన యోగా వేడుకల్లో డీఆర్‌ఎం లలిత్ బోరా మాట్లాడుతూ మానసిక, శారీరక అభివృద్ధికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బాల్యం నుంచే యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన అనంతరం రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబాలు, స్వచ్ఛంద సంస్థలు, స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్ బృంద సభ్యులు, యూనియన్ ప్రతినిధులు, నేవీ సిబ్బందితో కలిసి ఆర్ట్ ఆఫ్ లివింగ్ బోధకుల నేతృత్వంలో యోగాసనాలు చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఈకార్వో) ప్రెసిడెంట్ జ్యోత్స్నా బోరా, ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహూ, ఇ.శాంతారం, ఈకార్వో వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ అన్సారీ, అధికారులు పాల్గొన్నారు.

- సాలగ్రామపురం పోర్ట్ క్వార్టర్స్ వెనుక వైపు గల దీప్ భవన్ (డైరెక్టరేట్ ఆఫ్ లైట్ హౌసెస్ అండ్ లైట్ షిప్స్) కార్యాలయ ఆవరణలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ ముఖేష్ పర్మర్ మాట్లాడుతూ వారం రోజులుగా కార్యాలయ ఆవరణలో ప్రత్యేక యోగా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. యోగా సాధన వల్ల మానసిక ప్రశాంతత చేకూరి, పని ఒత్తిడి తగ్గుతుందన్నారు. బ్రహ్మకుమారీ సంస్థ రైల్వే న్యూకాలనీ ఇన్‌చార్జి శశికళ, యోగా గురువులు కబిలేష్ సింగ్, అంకిత యోగా, ధ్యానంపై లైట్ హౌస్ అధికారులు, సిబ్బందితో సాధన చేయించారు. అనిట్స్ డాక్టర్ యశ్వంత్ ఆరోగ్య సూత్రాలను వివరించారు. అనంతరం సిబ్బందికి చిరుధాన్యాలు, రాగిజావ, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ సి.ఎస్.మూర్తి, ఏఈఈలు గోపినాథ్ గండాల, సూరజ్ కాంతార్ కరుణేష్ సింగ్, రంజన్ చక్రవర్తి, ఇ.రాధిక, షేక్ మీరా దాస్, సిబ్బంది పాల్గొన్నారు.



దీప్ భవన్ వద్ద యోగా సాధనలో లైట్ హౌస్ అధికారులు, సిబ్బంది



యోగా దినోత్సవంలో పాల్గొన్న పీసీబీ అధికారులు, సిబ్బంది

పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యం

మర్రిపాలెం: 51వ వార్డు మాధవధారలోని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) కార్యాలయంలో అధికారులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ శ్రీరంజని మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉండాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. సిబ్బంది కార్యాలయం ముందు యోగాసనాలు వేశారు. హరిత యోగాలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. ఎస్‌ఈఈలు సుదర్శన్, రామారావునాయుడు, ఈఈలు శ్రీనివాస్, కరుణరేఖ, గోపీ నారపరెడ్డి, జగదీష్, ఏఈ సూర్యకళ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, యోగా మాస్టర్ గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్‌లో ఎస్టేట్ ఆఫీసర్ పి.జగదీశ్వరరావు నేతృత్వంలో రైతులు, డ్వాక్రా మహిళలు, వినియోగదారులు యోగాసనాలు వేశారు. డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ, పారాలీగల్ సెల్ వాలంటరీ సభ్యుడు ఆర్.శివసత్యనారాయణ, ప్యానల్ అడ్వకేట్ ఐ.శ్రీదేవి, దిలీప్, చిరంజీవి, రైతుబజారు సిబ్బంది పాల్గొన్నారు.



కంచరపాలెం రైతుబజార్‌లో యోగాసనాలు వేస్తున్న రైతులు, సిబ్బంది

ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సెలింగ్



పాలిటెక్నిక్ కాలేజీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది



గైస్‌లో విద్యార్థికి రిజిస్ట్రేషన్ పత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో సాంకేతిక కోర్సుల్లో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. యోగాంధ్ర కార్యక్రమం ఉన్నప్పటికీ, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ , కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నానికి విద్యార్థుల హాజరు పూర్తి స్థాయిలో ఉంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 7,501 నుంచి 15,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 296 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. వీరిలో 234 మంది బీసీ విద్యార్థులు, 44 మంది ఓసీలు, 17 మంది ఎస్సీలు, ఒకరు ఎస్టీ విద్యార్థి ఉన్నారు. వీరందరికీ రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్నకుమార్ పర్యవేక్షణలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎం. భాషా, లెక్చరర్ నాగరాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివారం 23,501 నుంచి 32,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ లో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ జరిగింది. ఇక్కడ 1 నుంచి 7,500 ర్యాంక్ వరకు గల విద్యార్థులకు రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ అందించారు. ఆదివారం 15,001 నుంచి 23,500 ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

లోటుపాట్లపై మండిపాటు

- 'యోగాంధ్ర'లో జనం అవస్థలు
- అందరికీ అందని టీ షర్టులు, మ్యాట్‌లు, ఫుడ్ ప్యాకెట్లు
- పోర్టు స్టేడియం బయట నిరీక్షణ



అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో యోగాసనాలు వేస్తున్న జనం



పోర్టు స్టేడియం ఖాళీ లేకపోవడంతో బయట ఉండిపోయిన జనం

సీతంపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం కూటమి ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన యోగాంధ్ర వేడుకలు అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. సమీప వార్డుల నుంచి జనం పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు వేశారు. ఉదయం 5 గంటల నుంచే జనం స్టేడియానికి చేరుకున్నారు. స్టేడియంలోని గ్రౌండ్‌ను కంపార్ట్‌మెంట్లుగా విభజించి, ప్రతి కంపార్ట్‌మెంట్‌కు 600 మంది యోగాసనాలు వేసేలా ఏర్పాటు చేశారు. స్టేడియం కెపాసిటీ 7 వేలు కాగా.. 9 వేల మందికి పైగా జనం పాల్గొన్నారు. దీంతో వేకువజాము నుంచే స్టేడియం సందడిగా మారింది. స్టేడియంలో ఖాళీ లేక కొంత మంది బయట ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

యోగా మ్యాట్‌ల కోసం ఆందోళన

స్టేడియం కెపాసిటీ 7 వేలు కాగా.. 9 వేల మంది యోగా వేడుకలకు హాజరయ్యారు. ముందుగా వచ్చిన వారికి మ్యాట్‌లు, టీ షర్టులు అందించారు. తర్వాత వచ్చిన వారికి అవి ఇవ్వకుండా యోగా వేడుకల్లో పాల్గొనండి, వెళ్లేటప్పుడు ఇస్తామని అధికారులు చెప్పడంతో వారంతా యోగాసనాలు వేశారు. తీరా వెళ్లేటప్పుడు అవి ఇవ్వక పోవడంతో సుమారు 500 మంది వరకు మ్యాట్‌లు, టీ షర్టులు ఇవ్వాలని అధికారులను నిలదీశారు. లేవని చెప్పడంతో వారంతా ఆందోళన చేపట్టారు. ఎట్టకేలకు అధికారులు దిగొచ్చి గొడవ చేయకండని జనాన్ని బతిమాలుకున్నారు. పోలీసుల సాయంతో మ్యాట్‌లు పంపిణీ చేసి బయటకు పంపించారు. టీ షర్టులు, ఫుడ్ ప్యాకెట్లు ఇవ్వలేదని జనం మండిపడ్డారు. అందరికీ ఇస్తామని చెప్పి ఇలా ఆందోళన చేపడితేగాని ఇవ్వరా అని అసహనం వ్యక్తం చేశారు.



యోగా మ్యాట్‌ల కోసం ఆందోళన చేస్తున్న స్థానిక ప్రజలు



టిఫిన్లు, భోజనం లేక నీరసించిన వలంటీర్లు

వలంటీర్లకు ఆకలి దప్పికలు

పోర్టు స్టేడియంలో జరిగిన యోగా వేడుకల్లో సేవలందించడానికి పెందుర్తి, గోపాలపట్నం ప్రాంతాలకు చెందిన 100 నుంచి 150 మంది విద్యార్థులను వలంటీర్లుగా నియమించారు. వీరిని బస్సుల్లో ముందు రోజు రాత్రి స్టేడియం వద్దకు తీసుకొచ్చారు. అన్ని ఏర్పాట్లు వారి చేత చేయించారు. కనీసం వారికి ఆహారం, మంచినీటి బాటిళ్లు సరిపడా ఇవ్వలేదని, చాలా మంది ఆకలితో రాత్రంగా జాగారం చేశామని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రంతా పడుకోకుండా సేవలందించిన తమకు రాత్రి భోజనం అరకొరగా ఇచ్చారని, శనివారం ఉదయం టిఫిన్లు ఇవ్వలేదని, పోలీసులు, ఇతర సిబ్బందికి మాత్రం టిఫిన్లు ఇచ్చారని, కనీసం తాగడానికి సరిపడా వాటర్ బాటిళ్లు కూడా ఇవ్వలేదని వాలంటీర్లు వాపోయారు.

జూలో జిరాఫీలపై అవగాహన




జిరాఫీ ఎన్‌క్లోజర్ వద్ద జిరాఫీ మాస్కులు వేసుకున్న చిన్నారులతో జూ అధికారులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో శనివారం అధికారులు ప్రపంచ జిరాఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీల్లో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులు గ్రూప్‌లుగా పాల్గొని ప్రతిభ చూపారు. జిరాఫీపై కథలు, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం యానిమల్ కీపర్లతో మాట్లాడించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అధికారులు జిరాఫీ మాస్కులు పంపిణీ చేశారు. వారిని జిరాఫీ ఎన్‌క్లోజర్ వద్దకు తీసుకెళ్లి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ జిరాఫీల గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జూలో ఉన్న జిరాఫీలు రెటిక్యులేటెడ్ ఉపజాతికి చెందినవన్నారు. కార్యక్రమంలో జూ అధికారులు, వెటర్నరీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అనుమానాస్పద మృతి

ఎచ్చెర్ల: లావేరు మండలం అదపాక సమీపంలోని పంట పొలాల్లో విశాఖపట్నం జిల్లా తాటిచెట్లపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పి.జగన్నాథం(35) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అదపాక వీఆర్‌వో ఎస్.వెంకటరమణ ఫిర్యాదు మేరకు లావేరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. లావేరు హెచ్‌సీ జోగారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పి.జగన్నాథం (ఫైల్)

ఫౌంటెయిన్ కాదు.. మంచినీటి పైప్‌లైన్ లీకేజీ



మద్దిలపాలెం వద్ద లీకవుతున్న మంచి నీటి పైప్‌లైన్

మద్దిలపాలెం: మద్దిలపాలెం ఏయూ గేట్ పక్కన, సీఎంఆర్ సెంట్రల్ ఎదురుగా మంచినీటి ప్రధాన పైప్‌లైన్ లీకవుతోంది. పైపులో నుంచి లీకవుతూ ఎగసిపడుతున్న మంచినీరు వాటర్ ఫౌంటెయిన్‌ను తలపిస్తోంది. సుమారు గంట పాటు నీరు లీకయింది. సంబంధిత అధికారుల నుంచి స్పందన లేదని స్థానికులు తెలిపారు. అనంతరం సమాచారం అందుకున్న జీవీఎంసీ సిబ్బంది అక్కడికి చేరుకుని పైప్‌లైన్ లీకేజీని సరి చేశారు.

డంపింగ్ యార్డులా రాజేంద్రనగర్ పార్కు



రాజేంద్రనగర్ పార్కులో డంప్ చేసిన బడ్డీలు

సీతంపేట: ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు... డంపింగ్ యార్డుగా మారింది. జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాల ఎదురుగా ఉన్న పార్కు డంపింగ్ యార్డును తలపిస్తోంది. వార్డుల్లో రోడ్డుపై తొలగించిన బడ్డీలను పార్కులో పడవేస్తున్నారు. అపూర్వ ఆస్పత్రి ఎదురుగా పార్కులో చెత్తాచెదారం, చెట్ల కొమ్మలు పేరుకుపోయి రోత పుట్టిస్తున్నాయి. గతంలో పార్కులో పడవేసిన బడ్డీలు తగలబడటంతో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. మళ్లీ పదుల సంఖ్యలో బడ్డీలను పార్కు స్థలంలో డంప్ చేయడంతో, అగ్ని ప్రమాదం సంభవించే అవకాశముందని సమీప నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ఎంతో విలువైన స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయడం, లేదా ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.